కేటీఆర్‌కు ఆహ్వానం


ఆహ్వానపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్: ఉప్పల్ భగాయత్‌లోని హెచ్‌ఎండీఏ లేఅవుట్‌లో వెలిసిన కాలభైరవ ఆలయ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలకు రావాలని గురువారం ఉప్పల్ ఎమ్మెల్యే అధ్వర్యంలో మాజీ మంత్రి మల్లారెడ్డి, ఆలయ నిర్వాహకులు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఆహ్వానపత్రాన్ని అందజేశారు. డిసెంబర్ 22,23 తేదీల్లో నిర్వహించే ఈ ఉత్సవాలు ఉప్పల్‌లో అతి పెద్ద పండుగ అని బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ప్రజలను కోరారు.

పరామర్శ

కుషాయిగూడ: రోడ్డు ప్రమాదంలో గాయపడి నిమ్స్‌లో చికిత్స పొందుతున్న జర్నలిస్టు కడియాల రమేష్‌బాబును గురువారం కార్పొరేటర్ బొంతు శ్రీదేవి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న ఆమె కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. మెరుగైన వైద్యం అందేలా చూస్తానన్నారు.

స్థానిక సమస్యలు పరిష్కరించాలి


స్థానిక సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి

కాప్రా: డివిజన్ ప్రథమపురి కాలనీలో కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్ల సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఇష్టానుసారంగా చెట్ల కొమ్మల నరికివేత, విద్యుత్ స్తంభాల సమస్యలను స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. రోడ్ల సమస్య సీఆర్‌ఎంపీ రెండోదశ కింద పరిష్కరిస్తామని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. ఇతర సమస్యలు కూడా పరిష్కరిస్తానని చెప్పారు. సూదుగు మహేందర్‌రెడ్డి, పవన్, సంతోష్, మనోజ్, అరుణ్, కిరణ్, దయాకర్, అభివర్మ, వర్షిత్ తదితరులు పాల్గొన్నారు.

ఎలివేటెడ్ కారిడార్‌కు భూసేకరణ


అల్వాల్‌లో పరిశీలిస్తున్న జిల్లా భూసేకరణ అధికారి శంకర్‌కుమార్


అల్వాల్: ప్యారడైజ్ నుంచి శామీర్‌పేట ఓఆర్‌ఆర్ వరకు ఎలివేటెడ్ కారిడార్ కోసం భూ సేకరణ జరుగుతుందని మేడ్చల్, మల్కాజిగిరిజిల్లా భూసేకరణ అధికారి కె.శంకర్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం అల్వాల్, లోతుకుంట, హకీంపేట ప్రాంతాల్లో హెచ్‌ఎండీఏ ఇంజినీర్లు, సర్వేయర్లు, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీకి సంబంధించిన వివరాలను రెవెన్యూ అధికారులు నమోదు చేశారు. ఇంటి నిర్మాణ పత్రాలు, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, పుట్టిన తేదీ వివరాలు జిరాక్స్ పత్రాలు సమర్పించాలని కోరారు.

యువత సామాజిక సేవలో పాల్గొనాలి


గౌతమ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

రామంతాపూర్ : డివిజన్ పరిధిలోని గోకుల్‌నగర్ బృందావన్ పార్కును గౌతమ్ అనే యువకుడు స్నేహితులతో కలిసి రూ. 2 లక్షల నిధులతో పార్కులో ఉన్న కమ్యూనిటీహాల్ కాంపౌండ్‌వాల్‌కు రంగులు వేయించడం,విద్యుత్ దీపాలు ఏర్పాటు, మొక్కలు నాటడం వంటి పనులు పూర్తి చేశారు. ఈ సందర్భంగా గురువారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వారిని సన్మానించారు.సామాజిక సేవలో కూడా పాల్గొని ప్రజలకు ఉపయోగపడేలా మంచి పనులు చేయాలని సూచించారు. బీఆర్‌ఎస్ నేతలు గంధం నాగేశ్వర్ రావు, రవి తదితరులు పాల్గొన్నారు.

శబరికి తరలిన అయ్యప్పలు



గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ పరిధిలోని సాయినగర్ సాయిబాబా దేవాలయం నుంచి అశోక్ గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్పస్వాములు ఇరుముళ్లు కట్టుకొని శబరియాత్రకు బయలుదేరారు. అయ్యప్పస్వాములు, భక్తులు పాల్గొన్నారు.

కార్యాలయ మార్పు ఎప్పుడో?

- ఆమడ దూరంలో సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం
- రిజిస్ట్రేషన్‌కు 3 నియోజకవర్గాలు దాటాల్సిన పరిస్థితి
- దశాబ్దాలుగా సమస్యలతో ఇబ్బంది పడుతున్న ప్రజలు


అల్వాల్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వచ్చిన ప్రజలు


అల్వాల్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం

అల్వాల్: మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా పరిధిలోని అల్వాల్ మండల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం హైదరాబాద్ బేగంపేట్ పాటిగడ్డలో ఏర్పాటైంది. అల్వాల్ మండల పరిధిలోని స్థలం క్రయవిక్రయాలు చేసిన వారు మూడు నియోజకవర్గాలు దాటుకుంటూ.. వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దీనికి తోడు అల్వాల్ నుంచి నేరుగా బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

సాయంత్రం వరకు వేచి చూడాలి..

రిజిస్ట్రేషన్ కోసం ఉదయం వెళ్తే సాయంత్రం వరకు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొందని ప్రజలు వాపోతున్నారు. అల్వాల్ పరిధిలోని మచ్చబొల్లారం, వెంకటాపురం, కానాజీగూడ, ప్రాంతాలకు చెందిన స్థల రిజిస్ట్రేషన్ కార్యకలాపాలు 16 కిలోమీటర్ల దూరంలోని బేగంపేట్ పాటిగడ్డలో జరుగుతున్నాయి.

వందల కోట్ల ఆదాయం..

ఏడాదికి సగటున 70 వేలకు పైగా రిజిస్ట్రేషన్ ప్రక్రియలు జరుగుతుంటాయి. దీంతో ప్రభుత్వానికి వందల కోట్ల రూపాయలు ఆదాయం సమకూరుతున్నా.. స్థానికంగా రిజిస్ట్రేషన్ కార్యాలయం ఏర్పాటు చేయలేకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

పరిశీలనలకే పరిమితం..

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం స్థానికంగా బదలాయింపు చేస్తామని ఎన్నికల్లో హామీలు ఇచ్చిన రాజకీయ పార్టీలు హామీలు ఇవ్వడం పరిపాటిగా మారింది. కార్యాలయం మార్పు కోసం స్థానిక నేతలు, ప్రజాసంఘాలు, 20 ఏళ్ల నుంచి పలు మార్లు అధికారులు, మంత్రులకు వినతిపత్రాలు అందజేసిన కేవలం పరిశీలనకే పరిమితం అవుతున్నాయనే ఆరోపణలున్నాయి.

15 ఏళ్ల క్రితం అప్పటి ఎమ్మెల్యే హామీతో..

15 ఏళ్ల క్రితం కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆకుల రాజేందర్ వినతి మేరకు అల్వాల్ దమ్మాయిగూడలో తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలతో పాటు సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు చేయగా స్థల వివాదంతో బదిలీ ప్రక్రియ నిలిచిపోయింది. ఇటీవల గెలిచిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి సైతం సంబంధిత మంత్రులు, అధికారులను కలిసి పరిస్థితిని వివరించారు. రిజిస్ట్రేషన్ కార్యాలయం అల్వాల్‌లోనే ఏర్పాటు చేయాలని కోరారు. అధికారులు కార్యాలయం మార్పిడి కోసం అద్దె భవనం చూస్తున్నామంటూ.. కాలయాపన చేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

మార్పు జరిగే వరకు పోరాటం కొనసాగిస్తాం..



రాష్ట్రంలోని అన్ని మండలాల్లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు స్థానికంగా ఏర్పాటు చేసినప్పటికీ అల్వాల్‌లో మాత్రం జరగడం లేదు. ప్రతి చిన్న పనికి 16కిలో మీటర్లు వెళ్లాల్సి వస్తుంది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతాం.

– దండుగుల వెంకటేష్, బీజేపీ నేత

ఘనంగా తిరుప్పావడ సేవ


ఆనంద్‌బాగ్ ఆలయంలో అన్నకూటోత్సవం

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌లోని లక్ష్మీవేంకటేశ్వర దేవస్థానంలో ధనుర్మాస పూజలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ పూజల్లో గురువారం తిరుప్పావడ సేవ (అన్నకూటోత్సవం) నిర్వహించారు. ప్రధాన అర్చకులు ముడుంబై వేంకటరమణాచార్యులు మాట్లాడుతూ.. దేశంలో ప్రజలు పాడిపంటలతో సుఖంగా ఉంటూ.. ఆహారానికి ఎలాంటి ఇబ్బందులు రాకూడదని, ఈతి బాధల భారిన పడకుండా ఉండాలని కోరుకుంటూ స్వామివారి రూపాన్ని చిత్రాన్నంతో సిద్ధం చేస్తామన్నారు. అనంతరం స్వామివారిని ఆవాహనం చేసి ఏకకాలంలో మూలవిరాట్, ఉత్సవమూర్తులతో పాటు అన్నరూపంలో ఉన్న వేంకటేశ్వరుడికి పూజలు చేశామన్నారు. ఈనెల 21న శనివారం పుబ్బ నక్షత్రం సందర్భంగా గోదాదేవి,మహాలక్ష్మి అమ్మవార్లకు గాజులతో అలంకరించి సేవ నిర్వహిస్తామని ఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. అర్చకులు తులసీ రమణాచార్యులు, క్లర్క్ సుధాకర్, భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

చెరువు సుందరీకరణ పనుల పరిశీలన



మల్కాజిగిరి: రామక్రిష్ణాపురం చెరువు సుందరీకరణలో భాగంగా చేపట్టి పనుల్లో భగత్‌సింగ్‌నగర్ కాలనీవాసుల కోసం అంబులెన్స్ వెళ్లేందుకు రోడ్డు వదలాలని కార్పొరేటర్ శ్రవణ్ హెచ్‌ఎండీఏ అధికారులను కోరారు. స్థానికుల కోరిక మేరకు చెరువు ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. సుందరీకరణలో భాగంగా సైకిల్, వాకింగ్‌ట్రాక్ ఏర్పాటు చేయడం హర్షనీయమని, అదే సమయంలో కాలనీ ప్రజల కోసం అంబులెన్స్ వెళ్లడానికి మార్గం అవసరమని అధికారులకు సూచించామన్నారు. త్వరలోనే హెచ్‌ఎండీఏ కమిషనర్‌కు కాలనీవాసులతో కలిసి లిఖిత పూర్వకంగా విజ్ఞప్తి చేస్తామన్నారు. కాలనీలో పార్కులో పిల్లల కోసం ఆట సామగ్రి, కమ్యూనిటీహాల్, మహిళాభవన్ ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. హెచ్‌ఎండీఏ అధికారులు కృష్ణ, రేణుక, హరీష్, కాలనీవాసులు, బీజేపీ నేతలు సంతోష్, మురళీగౌడ్, నందుయాదవ్, శ్రీదేవి పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించండి


అసెంబ్లీలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: రాష్ట్రంలో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించారు. ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో రేషన్ దుకాణాల డీలర్లకు ప్రస్తుతం బియ్యానికి క్వింటాల్‌కు రూ. 140 చెల్లిస్తున్నారని దానిని రూ. 300లకు పెంచాలన్నారు. గోధుమలకు అతి తక్కువగా క్వింటాల్‌కు రూ. 13 ఇస్తున్నారని దానిని రూ. 140కి పెంచాలన్నారు. 55 శాతం మందికే గోధుమలు...

గోధుమలు దాదాపుగా 55 శాతం మందికే దొరుకుతున్నాయని, దీనిపై ప్రభుత్వం దృష్టిసారించాలన్నారు. గన్నీ బ్యాగ్‌లను ఇతర రాష్ట్రాల నుంచి తీసుకొనిరావాల్సిన పరిస్థితి ఉందని, ప్రత్యామ్నాయంగా ఎకో ఫ్రెండ్లీ బ్యాగ్‌ల ద్వారా సరఫరా చేయాలన్నారు. కుటుంబసభ్యులందరికీ ఓటీపీ అవకాశం కల్పించాలన్నారు.

అప్పటి సీఎం హామీని అమలు చేయాలి..

కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రతి రేషన్ దుకాణానికి రూ.5000 ఇస్తామని చెప్పారని, దానిని రూ.20 వేలకు పెంచాలన్నారు. ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులు అందజేస్తామని చెబుతున్నారన్నారు. అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి రేషన్ దుకాణదారులు ఇతర వస్తువులు అమ్ముకోవడానికి విలేజ్‌మాల్ ఏర్పాటుకు జీవో తీసుకొచ్చారని, ప్రస్తుతం అదే పార్టీ ప్రభుత్వం ఉంది కాబట్టి అమలు చేయాలన్నారు.

ఇన్సూరెన్స్ కల్పించాలి..

హోంగార్డులు, వర్కింగ్ జర్నలిస్టులు, ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం ఇన్సూరెన్స్ ఇస్తోందని, రేషన్ డీలర్లకు కూడా అమలు చేయాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా చలానా ప్రస్తుతం చెల్లిస్తున్నారని, గతంలో నగదు రూపంలో చెల్లించిన వాటిలో సుమారు రూ.500 కోట్ల బకాయిలు డీలర్లకు ఉన్నారని వాటిని వెంటనే విడుదల చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సంబంధిత మంత్రికి విజ్ఞప్తి చేస్తున్నారన్నారు.

ముందస్తు అరెస్టులు


చర్లపల్లి పోలీస్‌స్టేషన్ వద్ద మాలమహానాడు నేతలు

కుషాయిగూడ: ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించ తలపెట్టిన అసెంబ్లీ ముట్టడి నేపథ్యంలో చర్లపల్లి పోలీసులు పలువురు మాల మహానాడు నేతలను ముందస్తు అరెస్టులు చేసి స్టేషన్‌కు తరలించారు. శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళ్తున్న మమ్మల్ని అరెస్టు చేయడం అప్రజాస్వామికమని సమితి ప్రతినిధులు అన్నారు. వెంకటేశ్వర్లు, బుంగ బాబు, బోడ వెంకటన్న, ఎలుక నరేష్ ఉన్నారు.

జేఏసీ నాయకుల ముందుస్తు అరెస్టు..

ఉప్పల్: ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని ఉప్పల్ పోలీసులు భగ్నం చేశారు. గురువారం ఉదయం నుంచే ముందస్తు అరెస్టులు చేశారు. వారు మాట్లాడుతూ.. 'రాష్ట్రంలో ఉన్న 50 లక్షల మంది మాలలు రేవంత్‌రెడ్డిని గద్దెనెక్కిస్తే తెలంగాణలో మాలల ఉనికి లేకుండా చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందని దుయ్యబట్టారు'. 'దేశంలో అత్యున్నత స్థానంలో ఉన్న అమిత్‌షా డా. బీఆర్.అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు'. ఆయన బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేదంటే దేశవ్యాప్తంగా ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం

అల్వాల్: ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తున్నానని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. గురువారం కౌకూర్‌లో పర్యటించిన ఆయన మాట్లాడుతూ.. కౌకూర్ నుంచి భరత్‌నగర్ వెళ్లే రహదారి విస్తరణకు చర్యలు తీసుకున్నామన్నారు. కౌకూర్‌లో నెలకొన్న ప్రతి సమస్యను పరిష్కరించడానికి తనవంతు కృషి చేస్తున్నామన్నారు. మచ్చబొల్లారం కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్, నాయకులు మల్లిఖార్జున్, డీఈ మహేష్, జలమండలి అధికారి మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

రాత్రుళ్లు సౌండ్ పొల్యూషన్‌పై కేసు నమోదు

అల్వాల్: రాత్రుళ్లు ప్రజలకు ఇబ్బంది కలిగించిన వారిపై నేరేడ్‌మెట్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సందీప్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి ఆర్కేపురం ఆఫీసర్ కాలనీలో రాత్రి 11 గంటల నుంచి 12 గంటల సమయంలో ఫంక్షన్‌హాల్ ఆర్గనైజర్లు పెద్ద శబ్దం కారణంగా ప్రజలు ఇబ్బంది పడ్డారని, దీంతో న్యూసెన్స్ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. రాత్రి 10 గంటల తర్వాత అనుమతి లేకుండా పొల్యూషన్, 10 గంటల తరువాత సౌండ్ పోల్యూషన్‌ను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదన్నారు. ఇష్టానుసారంగా వ్యవహరిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన


అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

అల్వాల్: పార్లమెంట్‌లో రాజ్యాంగ నిర్మాత బీఆర్.అంబేద్కర్‌ను కించపరిచేలా మాట్లాడారని, గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నేరేడ్‌మెట్ చౌరస్తాలో ధర్నా చేశారు. కేంద్రమంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్, నాయకులు ఎస్‌ఆర్.ప్రసాద్, చంద్రశేఖర్, శంకర్, సాయికుమార్, సత్యనారాయణ, చెన్నారెడ్డి, కుమార్, ఏ-బ్లాక్ అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, నాగరాజు, డివిజన్ అధ్యక్షుడు సంపత్‌గౌడ్, ప్రవీణ్, వినోద్‌యాదవ్, వెంకటేశ్వర్‌రావు, కుమార్, ప్రియదర్శిని, శారద, ప్రభ తదితరులున్నారు.

వీధిలైట్ల మరమ్మతుకు వినతి

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో వీధిలైట్లు వెలగడం లేదని కాప్రా డిప్యూటీ కమిషనర్‌కు మల్లాపూర్‌కు చెందిన సామాజిక వేత్త ఎస్వీకిట్టు ఫిర్యాదు చేశాడు. ఆన్‌లైన్‌లో ఈ సమస్యపై ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. మల్లాపూర్ ఎలిఫెంట్ సర్కిల్‌లో లైట్లు వెలగకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను పరిష్కరించాలని కోరారు.



నియోజకవర్గ సమస్యలు పరిష్కరించండి


సీఎంకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి


ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

అల్వాల్: నియోజకవర్గ సమస్యలపై సీఎం రేవంత్ రెడ్డిని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి కలిశారు.అల్వాల్ సర్కిల్‌లోని మచ్చబొల్లారం డివిజన్‌లో 7 కాలనీలు గ్రీన్‌ల్యాండ్స్ కాలనీ, గంగా అవెన్యూ, శ్రీనివాసిక కాలనీ, సాన్విఫైడ్‌హోమ్స్, ఎంఈఎస్. కాలనీ, ఎంహెచ్‌ఆర్. కాలనీల్లో తీవ్రమైన స్టార్మ్ వాటర్ డ్రైన్ సమస్యలను పరిష్కరించాలని, మెట్రోరైల్ ప్రాజెక్టు మల్కాజిగిరి ప్రజలకు అందుబాటులో లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ప్యారడైజ్ నుంచి కండ్లకోయ వరకు 22 కిలోమీటర్లు, తార్నాక నుంచి కీసర వరకు 20 కిలోమీటర్లు, జేబీఎస్ నుంచి శామీర్‌పేట్ వరకు 22 కిలోమీటర్లు మెట్రోరైల్ కనెక్టివిటీని మల్కాజిగిరి ప్రజల రవాణా సౌకర్యం కోసం అందుబాటులోకి తీసుకోవాలని కోరారు. మచ్చబొల్లారం జొన్నబండలోని 582 అండ్ 583 సర్వే నెంబర్లలో 55 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాలకు గురౌతుందని, పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని అక్కడ 50 ఏళ్ల నుంచి నివసిస్తున్న పేద వడ్డెర కులస్తులకు న్యాయం జరిగేలా చొరవ తీసుకోవాలని సీఎంకు ఎమ్మెల్యే వినతిపత్రం అందజేశారు.

ఆర్‌పీల కోసం ప్రణాళికాబద్ధమైన పోరాటం చేస్తా : మర్రి

అల్వాల్: ఆర్‌పీలకు వేతనాల పెంపు, ఉద్యోగభద్రత, ఉచిత బీమా సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. తెలంగాణ మెప్మా రీసోర్స్ పర్సన్స్ యూనియన్ అల్వాల్ కమిటీ సభ్యులు (ఆర్‌పీలు) గురువారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో పట్టణ, పేదరిక నిర్మూలన సంస్థలో ఆర్‌పీలుగా పనిచేస్తున్న మహిళలకు జీతాలు పెంచడానికి ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తోందన్నారు. నియోజకవర్గంతో పాటు రాష్ట్రంలోని ఆర్‌పీల కోసం ప్రణాళికాబద్ధమైన పోరాటం చేస్తానని, అసెంబ్లీ సమావేశాల్లో ఆర్‌పీల సమస్యలను ప్రభుత్వానికి తెలియచేస్తానన్నారు. సునీత, సంగీత, పార్వతి, రుక్మిణి, రేవతి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనం

మల్కాజిగిరి: అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షాను మంత్రి పదవి నుంచి వైదొలగాలని మల్కాజిగిరిలోని దళిత సంఘం నేతలు నిరసన చేపట్టారు. గురువారం ఆనంద్‌బాగ్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపి ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. రావుల అంజయ్య, గంగాధర్ కృష్ణ, పీఎల్.శ్రీనివాస్, గణేష్, ఉపేందర్, సతీష్, లక్ష్మి, ఆనంద్, కవిత, బైరు అనిల్, నరేష్, నర్సింగ రావు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కుషాయిగూడ: డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌పై అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశారని, కేంద్ర హోంమంత్రి అమిషా దిష్టిబొమ్మను గురువారం ఎన్‌ఎస్‌యూఐ నాయకులు ఈసీఐఎల్ చౌరస్తాలో దహనం చేశారు.


ఈసీఐఎల్ చౌరస్తాలో..

అమిత్‌షాకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ.. వెంటనే క్షమాపణలు చెప్పి, మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎన్‌ఎస్‌యూఐ ఉప్పల్ అధ్యక్షుడు బండిరాల కిషోర్, నేతలు తరుణ్, కిరణ్, రమేష్, సాయి, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.


అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దళిత సంఘం నేతలు

హోమియో బోధనాసుపత్రిలో సౌకర్యాలేవి?



మందుల కోసం బారులు తీరిన రోగులు, చేతులపైనే రోగిని మోసుకెళ్తున్న బంధువులు

రామంతాపూర్ : ప్రభుత్వ హోమియోపతి బోధన ఆసుపత్రిలో సరైన సౌకర్యాలు లేక రోగులు ఇబ్బంది పడుతున్నారు. గురువారం 'సాక్షి' ఆసుపత్రిని సందర్శించగా.. అవుట్ పేషెంట్లు మందుల కోసం క్యూలైన్‌లో గంటల తరబడి నిలబడ్డారు. రోజూ వందలాది మందికి మందులు పంపిణీ చేసేందుకు కేవలం రెండే కౌంటర్లు ఉన్నాయని, మరో అదనపు కౌంటర్లను పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

కనిపించని వీల్‌చైర్లు, స్ట్రేచర్లు..

ఓ వృద్ధుడి కాలికి గాయం కాగా.. బ్యాండేజ్ కట్టించుకుని, ఇన్ పేషెంట్ వార్డులోకి వెళ్లేందుకు కనీసం వీల్‌చైర్, స్ట్రేచర్లు అందుబాటులో లేకపోవడంతో అతడి బంధువులు చేతుల మీద మోసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ ఆయుష్ విభాగం ఉన్నతాధికారులు చొరవ తీసుకుని ఆసుపత్రికి వచ్చే రోగులకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక


అభినందిస్తున్న త్రివేణి పాఠశాల నిర్వాహకులు

అల్వాల్: భారత వాతావరణ శాఖ ఏర్పడి 150 ఏళ్లైన సందర్భంగా భారత ప్రభుత్వం దేశవ్యాప్తంగా 8,9,11 తరగతుల విద్యార్థులకు డిసెంబర్ 14,15 తేదీల్లో నిర్వహించిన నేషనల్ మెట్రోలాజికల్ ఒలంపియాడ్‌లో తెలంగాణ నుంచి అల్వాల్ త్రివేణి విద్యార్థులు 8వతరగతి చదువుతున్న ఎం. సుదీప్‌రెడ్డి, మొదటి ర్యాంక్, పి. హేమంత్ మూడో ర్యాంక్, 9వ తరగతి చదువుతున్న హాస్య ప్రణవి రెండో ర్యాంక్ సాధించి జాతీయస్థాయికి ఎంపికయ్యారు. గురువారం పాఠశాలలో విద్యార్థులు వారి తల్లిదండ్రులకు పీఆర్‌ఓ. వెంకట్రావ్, సైన్స్ అధికారి సుబ్బారావులు అభినందించారు.

కార్మికులకు అవకాశం కల్పించండి


కార్మికులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్

కుషాయిగూడ: భారత్ గ్యాస్ రీఫిల్లింగ్ ప్లాంట్‌లో పనిచేసే కార్మికులకు ఓ అవకాశం కల్పించాలని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్‌ఎస్ ప్రభాకర్ బీపీసీఎల్ యాజమాన్యాన్ని కోరారు. చర్లపల్లి పారిశ్రామికవాడలోని భారత్ గ్యాస్ రీఫిల్లింగ్ ప్లాంట్‌లో సిలిండర్లు లోడింగ్, అన్‌లోడింగ్ చేసే కాంట్రాక్టు కార్మికులను తొలగిస్తూ.. నిర్ణయం తీసుకోవడంతో కార్మికులు గత మూడ్రోజులుగా ప్లాంట్ వద్ద ఆందోళన చేస్తున్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గురువారం ప్లాంట్‌ను సందర్శించి కార్మికులతో మాట్లాడారు. అనంతరం బీపీసీఎల్ ఏపీ హెడ్ అరుణ్‌మోహన్, ప్లాంట్ ఇన్‌చార్జి వేదప్రకాష్‌లతో మాట్లాడి సమస్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచుకోవాల్సిన అవశ్యకత ఉందన్నారు. దీనిలో భాగంగానే కొత్త వారిని తీసుకున్నామని, వారితో ప్రస్తుతం ఉన్న కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని చెప్పారు. గత 25 ఏళ్లుగా ప్లాంట్‌ను నమ్ముకుని పనిచేసుకుంటున్న కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులకు సూచించానన్నారు. కార్మికులకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోబోమని, అవసరమైతే సంబంధిత మంత్రిని కలిసి వారిని న్యాయం జరిగేలా చూస్తానన్నారు.